సాక్షి
జగిత్యాల
ఆదివారం । 26 । నవంబర్ । 2023



వైభవంగా గంగాహారతి

ధర్మపురి:ధర్మపురిలో గంగాహారతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలు గోదావరి వద్ద పూజలు చేసి నదిలో దీపాలు వదిలారు.



కార్తీక దీపోత్సవం

మల్లాపూర్: మండల కేంద్రంలోని కనక దుర్గాదేవి ఆలయంలో శనివారం కార్తీక దీపోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/19.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది. సాయంత్రం చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

30న వేతనంతో కూడిన సెలవు



యాస్మిన్ బాషా, కలెక్టర్

జగిత్యాల: శాసనసభ ఎన్నికల సందర్భంగా ఈనెల 30న జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు ఎన్నికల పనుల కోసం ఈనెల 29న సెలవుదినంగా ప్రకటించినట్లు పేర్కొన్నారు.

పోలింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి



పోల్ చిట్టీల పంపిణీని పరిశీలిస్తున్న బసవ రాజేంద్ర

జగిత్యాల: పోలింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎన్నికల పరిశీలకులు బసవ రాజేంద్ర అన్నారు. శనివారం జిల్లాకేంద్రంతోపాటు, గొల్లపల్లి, చిల్వాకోడూర్, ధర్మారం తదితర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు, భారీకేడ్లను పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పోల్ చిట్టీల పంపిణీని పరిశీలించారు. ఆయన వెంట పోలీసు పరిశీలకులు వివేకనంద సింగ్ పాల్గొన్నారు.

నృసింహుడిని దర్శించుకున్న ఎలక్షన్ పరిశీలకులు



నృసింహుడి సన్నిధిలో ఎలక్షన్ పరిశీలకులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారిని శనివారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల ఎలక్షన్ పరిశీలకులు యోగేష్ సుఖదేవ్ దర్శించుకున్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్ స్వామివారి శేష వస్త్రం కప్పి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులున్నారు.

ఘనంగా తులసీ కల్యాణం



వేడుకలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి: కార్తీకమాసంలో భాగంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ఆవరణలో తులసి కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో శేషప్ప కళావేదికపై శనివారం స్వామివారల కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులున్నారు.

పగలు ప్రచారం.. రాత్రి వ్యూహాలు

- ప్రచార జోరుపెంచిన అభ్యర్థులు
- ఇంటింటికీ వెళ్లడమే లక్ష్యం

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికల గడువు దగ్గరపడుతున్న కొద్దీ అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ ప్రజాక్షేత్రంలోనే ఉంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రచారంలో మునిగితేలుతున్న అభ్యర్థులు.. రాత్రిపూట ఓటర్లను ఎలా ఆకట్టుకోవాలోనని వ్యూహాలు రచిస్తున్నారు. నిత్యం ప్రజల మధ్యనే గడుపుతూ వారి మద్దతు కూడగడుతున్నారు. పగలంతా ఇంటింటికీ వెళ్లడమే లక్ష్యంగా పెట్టుకుని ప్రజల మధ్యనే గడుపుతూ ప్రజలను కలుస్తూ తమను గెలిపిస్తేనే ఏయే అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామో కరపత్రాలు ముద్రించి మరీ వివరిస్తున్నారు. ఒక వైపు మైకులతో ప్రచారం నిర్వహించుకుంటూనే పోటాపోటీగా ప్రచారం చేపడుతున్నారు. పగలంతా గ్రామాలు.. పట్టణాల్లో సమావేశాలు నిర్వహిస్తూ రాత్రి కాగానే ఓటర్లను ఎలా రాబట్టుకోవాలో ప్రత్యేక వ్యూహాలు రచిస్తున్నారు. సమయం దగ్గర పడుతున్న కొద్దీ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఇంకా మూడు రోజులు మాత్రమే ప్రచారానికి గడువు ఉండటంతో గ్రామాల చొప్పున ఒక్కో గ్రామంలో 2 గంటల నుంచి 3 గంటలు గడుపుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో విజయం కోసం ముందుకు వెళ్తున్నారు. ఎత్తులకు పైఎత్తు వేసుకుంటూ అనుచరగణంతో సమావేశాలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తున్నారు.



రాత్రి సమావేశాలు

ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు ప్రస్తుతం ప్రతి గంటా విలువైందే కావడంతో ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎలాంటి విరామం లేకుండా ప్రచారం నిర్వహిస్తున్నారు. 10 గంటల తర్వాత ద్వితీయ శ్రేణి నాయకులు.. వివిధ కుల సంఘాల నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ ఓట్లు రాబట్టుకునేందుకు పక్కా వ్యూహాలు రచిస్తున్నారు. ఏ నాయకుడికి ఎంత పలుకుబడి ఉంది..? ఏ కుల సంఘాలను పార్టీలోకి చేర్చుకోవాలి..? అనేది రచిస్తూ వారి మద్దతు కూడగట్టుకునేందుకు ఉదయం వారి వద్దకు వెళ్లి మాట్లాడుతూ పార్టీలో కలుపుకొనేలా ముందుకెళ్తున్నారు. ముఖ్యంగా కుల సంఘాలు, ఉద్యోగులు, వివిధ వర్గాలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి మద్దతు కోరడంతోపాటు, కచ్చితంగా ఓట్లు వేయాలని ఒప్పందాలు చేసుకుంటున్నారు. ప్రతి అభ్యర్థి విజయమే లక్ష్యంగా రాత్రి 10 గంటల నుంచి వేకువజాము వరకు మంతనాలు జరుపుతూ.. నిద్ర కూడా పోవడం లేదు. యువతను ఎలా ఆకట్టుకోవాలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కార్యకర్తలు, అభిమానులు, యువతను వెంట బెట్టుకుని ప్రచారానికి వెళ్తున్నప్పటికీ యువత ఓట్లు అత్యధికంగా ఉండటంతో వారి ఓట్లు రాబట్టుకునేందుకు వారికి తాయిలాలు అప్పగిస్తున్నట్లు తెలిసింది. పనుల్లో బిజీగా ఉన్నా యువత ప్రతి పార్టీల వెంబడి తిరుగుతున్నారు. చేతిఖర్చుల కోసం యువత కూడా పాల్గొంటున్నారు. యువతకు సంబంధించిన కుటుంబసభ్యుల ఓట్లు రావాలన్నా యువతతోనూ సమావేశాలు ఏర్పాటు చేస్తూ గంపగుత్తగా ఓట్లు పడేలా చూస్తున్నారు.

మెడికల్ హబ్‌గా జగిత్యాల

- అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి
- నా పనితీరే మళ్లీ గెలిపిస్తుంది
- ప్రచారానికి ప్రజల్లో మంచి ఆదరణ
- 60 ఏళ్లలో చేయనిది ఐదేళ్లలో చేశా
- నియోజకవర్గానికి రూ.వెయ్యి కోట్లు తెచ్చా..
- మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేశాం
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



జగిత్యాల: జగిత్యాల నియోజకవర్గాన్ని రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేశా. విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చా. మన ఊరు మన బడి ద్వారా పాఠశాలలను మెరుగుపర్చుకున్నాం. జిల్లాకేంద్రానికి మెడికల్ కళాశాల తెచ్చి మెడికల్ హబ్‌గా మార్చా. 60ఏళ్లలో జరగని అభివృద్ధిని ఐదేళ్లలో చేసి చూపించా. జగిత్యాల మాస్టర్ ప్లాన్ రద్దు చేశాం.. నా పనితీరే మరోసారి నన్ను గెలిపిస్తుంది. ప్రచారానికి స్పందన వస్తోంది..' అన్నారు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్. 'సాక్షి'తో మరిన్ని విషయాలు వెల్లడించారు.

- **సాక్షి:** అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికతో ముందుకెళ్తున్నారు..?
- **సంజయ్:** మొదటిసారి ఎమ్మెల్యే అయిన అనంతరం వైద్య విద్య కోసం కృషి చేశాను. ఇక్కడ మెడికల్ కళాశాల ఏర్పాటు ఆవశ్యకతను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాను. వైద్య కళాశాల, మాతాశిశు సంరక్షణ కేంద్రం, సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌తో జగిత్యాల మెడికల్ హబ్‌గా మారింది.
- **సాక్షి:** ప్రచారంలో ఎలా ముందుకెళ్తున్నారు..?
- **సంజయ్:** ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయి. వాటన్నిటినీ ప్రజలకు వివరిస్తూ ముందుకెళ్తున్నాం.
- **సాక్షి:** మాస్టర్ ప్లాన్ విషయంలో గతంలో వివాదం తలెత్తింది.. రద్దయ్యిందా..? లేదా..?
- **సంజయ్:** జగిత్యాల మాస్టర్ ప్లాన్‌ను పూర్తిగా రద్దు చేశాం. ప్రతిపక్షాలు రద్దు కాలేదంటున్నాయి. ఇది విడ్డూరంగా ఉంది. ఎప్పుడూ రైతులకు అండగా ఉంటా. రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా చూస్తా.
- **సాక్షి:** ఐదేళ్లలో ఎలాంటి అభివృద్ధి చేశారు..?
- **సంజయ్:** జిల్లాకేంద్రం కావడంతో మెడికల్ కళాశాల తీసుకొచ్చాం. నర్సింగ్ కళాశాల, మాతాశిశు సంరక్షణ కేంద్రం, డయాగ్నోస్టిక్ సెంటర్, సమీకృత కలెక్టర్ కార్యాలయం, యావర్‌రోడ్డు విస్తరణ ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. నియోజకవర్గానికి రూ.వెయ్యి కోట్లు తెచ్చి అభివృద్ధి చేశాను.
- **సాక్షి :** డబుల్‌బెడ్‌రూం నిరుపేదలకు అందాయా..?
- **సంజయ్:** రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా 4,520 ఇళ్లు జగిత్యాలకు మంజూరు చేయించాను. ఇప్పటికే మూడు వేలకుపైగా లబ్ధిదారులకు అందించాం. మిగతావి కూడా అందిస్తాం. ఇది జగిత్యాలకే ఐకాన్.
- **సాక్షి:** మరోసారి అవకాశమిస్తే ఎలాంటి పనులు చేపడతారు?
- **సంజయ్:** మంత్రి కేటీఆర్ మాట ఇచ్చిన ప్రకారం జిల్లాకేంద్రంలో అండర్ డ్రైయినేజీ సిస్టమ్ ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే చాలావరకు రోడ్లు, పార్కులు, జంక్షన్లను అభివృద్ధి చేసుకున్నాం. కొన్నికొన్ని చోట్ల ఇంకా కావాల్సి ఉంది. వాటిని పూర్తి చేస్తాం.
- **సాక్షి:** ప్రచారం ఎలా సాగుతోంది..?
- **సంజయ్:** నియోజకవర్గ ప్రజలు నన్ను గుండెల్లో పెట్టుకున్నారు. బాగా ఆదరణ వస్తోంది. ప్రతిపల్లెనూ అద్భుతంగా తీర్చిదిద్దాను. పల్లె నిద్ర చేస్తూ పల్లె గ్రామాల సమస్యలను తెలుసుకుంటూ ముందుకెళ్లాను.
- **సాక్షి:** గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి చేపట్టారు..?
- **సంజయ్:** సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో నియోజకవర్గంలో అద్భుతమైన అభివృద్ధి చేశాం. పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, ప్రతి గల్లీకి సీసీరోడ్లు, రైతువేదికలు, పల్లెలు పట్టుకొమ్మలుగా తయారుచేశాం.
- **సాక్షి:** డాక్టర్‌గా సేవ చేశారు. ఇప్పుడు ఎమ్మెల్యేగా.. ఎలా అనిపిస్తోంది..?
- **సంజయ్:** నేను ఎమ్మెల్యే కాకముందు ప్రజలకు డాక్టర్‌గా ఎంతో సేవ చేశాను. కొంత మిస్ అవుతున్నా.. ఏదో ఒక సమయంలో ఇప్పటికీ నిరుపేదలకు కంటి శస్త్ర చికిత్సలు చేస్తూ ముందుకెళ్తున్నాను. నాకు ప్రజలు ఎప్పుడూ అండగా ఉంటారు.
- **సాక్షి:** జగిత్యాల వ్యవసాయాధారిత జిల్లా.. ఎలా ముందుకెళ్తారు..?
- **సంజయ్:** ఇక్కడ పండ్ల తోటలు అధికంగా ఉన్నాయి. ముఖ్యంగా మామిడి. ఫ్రూట్స్‌కు సంబంధించిన పరిశ్రమ ఏర్పాటు చేసేలా చూస్తా. గతంలో మంత్రి కేటీఆర్ సైతం హామీ ఇచ్చారు. ఇక్కడ పెద్ద పరిశ్రమ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటా.

నేడు సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభ



బందోబస్తు ఏర్పాట్లపై ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న డీఎస్పీ



పూర్తయిన సభా వేదిక

- సభకు ఏర్పాట్లు పూర్తి
- బందోబస్తు డీఎస్పీ ఆరా..

జగిత్యాల: జిల్లాకేంద్రమైన జగిత్యాలలో ఆదివారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరుకానున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కేంద్రంలోని గీతా విద్యాలయం మైదానంలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఆశీర్వాద సభ కొనసాగనుంది.

జనసమీకరణకు ఏర్పాట్లు

సీఎం సభకు భారీగా జనసమీకరణ చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమయ్యాయి. నియోజకవర్గంలోని మహిళలు, వృద్ధులు, అన్నివర్గాల ప్రజలు హాజరయ్యేలా ద్వితీయ శ్రేణి నాయకులందరూ బాధ్యత తీసుకున్నారు.

సభను విజయవంతం చేయాలి

సీఎం సభను విజయవంతం చేయాలని రాజ్యసభ ఎంపీ దామోదర్‌రావు అన్నారు. ఈ మేరకు సభ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, మాజీమంత్రి రాజేశంగౌడ్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా.. పార్కింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

జగిత్యాలక్రైం: సీఎం సభకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ వెంకటస్వామి తెలిపారు. సభకు వచ్చే వాహనాలకు పార్కింగ్, సభ వేదిక వద్దకు జనం వచ్చేలా రూట్‌మ్యాప్ సిద్ధం చేశామన్నారు.

బీడీ కార్మికులందరికీ పెన్షన్లు అందిస్తాం

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



మాట్లాడుతున్న కవిత, చిత్రంలో సంజయ్

మెట్‌పల్లి(కోరుట్ల): ఎన్నికల తర్వాత బీడీ కార్మికులందరికీ పెన్షన్లు అందజేస్తామని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. పట్టణంలో శనివారం బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ తరఫున ప్రచారం చేశారు. అయ్యప్ప ఆలయం, కూరగాయల మార్కెట్, రాంనగర్ క్లబ్ ప్రాంతాల్లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. రేషన్ షాపుల ద్వారా అందిస్తున్న దొడ్డు బియ్యాన్ని అమ్ముకుంటున్న విషయం తెలుసుకున్న సీఎం కేసీఆర్..దాని స్థానంలో సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించారన్నారు. కోరుట్ల నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అభివృద్ధి చేశారని, వచ్చే ఎన్నికల్లో సంజయ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పాల్గొన్నారు.

కేసీఆర్ అవినీతి పాలన అంతం చేయాలి

- కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్, సినీనటి విజయశాంతి



మల్లాపూర్‌లో మాట్లాడుతున్న విజయశాంతి

మల్లాపూర్ :సీఎం కేసీఆర్ పదేళ్ల అవినీతి పాలనను అంతం చేయాలని కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్, సినీనటి విజయశాంతి అన్నారు. శనివారం రాత్రి మండలకేంద్రంలోని హనుమాన్ కూడలి వద్ద కార్నర్ మీటింగ్‌లో పార్టీ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావుకు మద్దతుగా ప్రచారం చేశారు. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా దళితుడినే చేస్తామని ప్రకటించిన కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ అవినీతి పాలనతో రాష్ట్రం అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కేసీఆర్ అవినీతి సొమ్మును వెలికితీస్తామన్నారు. ప్రజల మేలు కోసమే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ఇస్తోందన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. పీసీసీ నాయకులు జువ్వాడి కృష్ణారావు, మాజీ జెడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి పాల్గొన్నారు.





ఘనంగా వెంకన్న తెప్పోత్సవం

కోరుట్లరూరల్:మండలంలోని వెంకటాపూర్ శివారు శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా స్వామివారికి శనివారం తెప్పోత్సవం నిర్వహించారు. అభిషేకం, విశేష అలంకరణ, కుంకుమార్చన, నిత్యహోమం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తెప్పోత్సవాన్ని తిలకించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కటుకం రాజేశ్, ఎంపీపీ తోట నారాయణ, సర్పంచ్ తోట శారద, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

గొల్లపల్లి: మండలంలోని ఇబ్రహీంనగర్‌లో శనివారం నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుప్పాల శ్రీధర్ సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. 106 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వ్యాధి నిరోధక టీకాలపై పలు సూచనలు చేశారు. మండల వైద్యాధికారి నరేష్, సూపర్వైజర్ నరేందర్, ద్వారక, శారద, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి):కొండగట్టు శ్రీఆంజనేయస్వామివారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. హారతిపూజ, సత్యానారాయణస్వామి వ్రతం నోముకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ సునీల్, శ్రీనివాసశర్మ పర్యవేక్షించారు.



ప్రజా తెలంగాణ రావాలి

- కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి
- వేములవాడలో రాహుల్‌గాంధీ



అభివాదం చేస్తున్న రాహుల్‌గాంధీ



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్

వేములవాడ: 1200 మంది బలిదానాలు చేసుకుంటే వచ్చిన తెలంగాణ.. కల్వకుంట్ల కుటుంబం కబంధ హస్తాల్లో బందీ అయ్యిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. దొరల తెలంగాణ పోయి.. ప్రజా తెలంగాణ రావాలన్నారు. వేములవాడలో శనివారం నిర్వహించిన ఎన్నికల బహిరంగసభలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ఆరు గ్యారంటీల అమలు బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, ఆరోగ్య వికాసం పథకాలను పక్కాగా అమలు చేస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల కళలను నాశనం చేసిందని, విద్యార్థుల భవిష్యత్‌ను పక్కనపెట్టిందని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని మెనిఫెస్టో విడుదల చేశామన్నారు. పదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం చేసిన అవినీతి డబ్బులను బయటకు తీసి ప్రజలకు పంచుతామన్నారు. దేశ సంపదను ప్రధాని మోదీ తన స్నేహితులకు దోచిపెడుతుంటే.. రాష్ట్రంలో కేసీఆర్ ఆయన కుటుంబం కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి..

ఒక్కసారి ఓట్లు వేసి గెలిపిస్తే వేములవాడ నియోజకవర్గ ప్రజల సేవ చేసుకుంటానని ఆ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రజల కష్టాలు తీరుతాయన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి

- వేములవాడకు వికాస్ సేవలు అవసరం
- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్



అభివాదం చేస్తున్న యూపీ సీఎం యోగి, బీజేపీ వేములవాడ అభ్యర్థి వికాస్‌రావు, ఇతర నాయకులు

వేములవాడ: డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. వేములవాడలో శనివారం నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో మాట్లాడారు. వేములవాడకు వికాస్‌రావు సేవలు అవసరమని, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీనియర్ నాయకుడు సీహెచ్.విద్యాసాగర్ రావు తనయుడిగా, విద్యావంతుడిగా, వైద్యుడిగా ఈ ప్రాంతానికి ఎంతో సేవ చేస్తున్న డాక్టర్ వికాస్‌రావును గెలిపించాలని కోరారు. వికాస్‌రావును గెలిపిస్తే అయోధ్య రాం మందిరం ప్రారంభోత్సవానికి వేములవాడ వాసులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయిస్తానని ప్రకటించారు. అనంతరం జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు.

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి..

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, తనను గెలిపిస్తే వేములవాడను అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ అభ్యర్థి డాక్టర్ వికాస్‌రావు పేర్కొన్నారు. యువతకు ఉపాధిమార్గాలు చూపుతానని హామీ ఇచ్చారు. మహిళలు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పిస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎక్కువ నిధులు తీసుకొచ్చి రాజన్న ఆలయాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతానన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, భారీ ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యం, వాహనం స్వాధీనం



పట్టుబడిన మద్యం

ధర్మపురి: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ముత్యం తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మండలంలోని రాయపట్నం వద్ద శుక్రవారం రాత్రి రూట్ వాచ్ చేస్తుండగా ద్విచక్రవాహనంపై అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకొని మద్యం, వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది గంగాధర్, లక్ష్మీనర్సయ్య, దుర్గాప్రసాద్, జలపతి తదితరులున్నారు.

ముస్తాబాద్ పంచాయతీకి నోటీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మేజర్ పంచాయతీ కార్యదర్శి రాజుకు జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) గౌతంరెడ్డి నోటీసులు జారీ చేశారు. మేజర్ పంచాయతీ కార్యాలయంలో బిల్ బుక్కుల విషయంలో జరిగిన అవకతవకలపై పంచాయతీ కార్యదర్శితోపాటు ఇద్దరు సిబ్బంది, ఎంపీవో ఆరీఫ్‌కు నోటీసులు వచ్చాయి. పంచాయతీ పాలకవర్గానికి తెలియకుండా ఆరునెలల క్రితం బిల్ బుక్కులను ముద్రించి, వాటినే ప్రజలకు ఇచ్చారు. ఎంపీవోకు సమాచారం ఇవ్వకుండా బిల్ బుక్కుల వినియోగంపై అదనపు కలెక్టర్ వారిని సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. కాగా పంచాయతీ కార్యదర్శి రాజు ప్రస్తుతం తుర్కపల్లిలో విధులు నిర్వర్తిస్తున్నారు. బిల్ బుక్కులతోపాటు, ఇండ్ల అనుమతుల విషయంలో జిల్లా అధికారులకు సర్పంచ్, ఉపసర్పంచ్ ఫిర్యాదు చేయగా అదనపు కలెక్టర్ నోటీసులు జారీ చేశారు.

దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరి రిమాండ్

సిరిసిల్లక్రైం: నిత్యవసరాల కోసం సైకిల్‌పై బయటకు వచ్చిన వ్యక్తిని దారి మధ్యలో అడ్డగించి అతడి సైకిల్‌తోపాటు సెల్‌ఫోన్, నగదు లాక్కెళ్లిన ఇద్దరిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం సుందరయ్యనగర్‌కు ఒడ్నాల సమ్మయ్య నిత్యవసరాల నిమిత్తం రెండు రోజుల క్రితం బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు బెదిరించారు. అతడి సైకిల్‌తోపాటు, సెల్‌ఫోన్, నగదు తీసుకున్నారు. దీంతో బాధితుడు సిరిసిల్ల టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సిరిసిల్ల పట్టణం సంజీవయ్యనగర్‌కు చెందిన యాలకుల అశోక్, ఇల్లంతకుంట మండలం వెల్జిపూర్‌కు చెందిన గడ్డం తిరుపతి దారి దోపిడీకి పాల్పడినట్లు తేల్చారు. నిందితులిద్దరిని శనివారం సిరిసిల్లలో పట్టుకుని సైకిల్, సెల్‌ఫోన్, రూ.వెయ్యి నగదు రికవరీ చేశారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

వలస ఓటర్లపై ప్రత్యేక దృష్టి

- జిల్లా నుంచి సుమారు 70 వేల మందికి పైగా ఇతర ప్రాంతాల్లో..
- ఎన్నికల రోజు తీసుకొచ్చేందుకు ప్రణాళికలు
- స్థానిక నాయకుల ద్వారా సమాచార సేకరణ



బుగ్గారం(ధర్మపురి): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు నెలకొంది. ఆయా పార్టీల అభ్యర్థులు ప్రతీ ఓటును కీలకంగా భావిస్తున్నారు. ఈ క్రమంలో జీవనోపాధి కోసం జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకోసం ఆయా నియోజకవర్గాల పరిధిలోని స్థానిక నాయకుల ద్వారా సమాచారం సేకరిస్తున్నారు.

జిల్లావాసులే అధికం

దేశంలోని వివిధ పట్టణాల్లో జగిత్యాల జిల్లా నుంచి వేలాది మంది వలస వెళ్లినప్పటికీ ముఖ్యంగా ముంబాయ్, బీవండి, పుణే నగరాలలోనే ఎక్కువగా ఉంటున్నారు. ప్రధానంగా కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల, రాయికల్, ధర్మపురి మండలాల నుంచి అధిక సంఖ్యలో మహారాష్ట్రకు వలస వెళ్లినవారు ఉంటారు. ఆయా సంఘాలు, అసోసియేషన్‌ల సమాచారం ప్రకారం జిల్లా నుంచి సుమారు 70 వేల మందికి పైగా ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. అలాగే హైదరాబాద్‌లో సైతం ఉద్యోగ, ఉపాధి రీత్యా పెద్ద సంఖ్యలోనే నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో వారి ఓట్లపై అన్ని పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి.

స్థానిక నాయకులకు బాధ్యతలు

వలస ఓటర్ల వివరాలు సేకరించడానికి ఆయా పార్టీల స్థానిక నాయకులకు బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు రంగంలోకి దిగి తమ ఊరి నుంచి ఎవరెవరు ఏయే ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు, వారి కుటుంబంలో ఎంతమంది జిల్లాలో ఓటు హక్కును కలిగి ఉన్నారనే సమాచారం సేకరిస్తున్నారు. వారి ఫోన్‌నంబర్లు సేకరించి ఓటింగ్ రోజు రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో గల తెలుగు వారి సంఘాల నాయకులతో సంప్రదింపులు జరుపుతూ వారిని స్వస్థలానికి తీసుకురావడానికి సహకారం అందించాల్సిందిగా కోరుతున్నారు. ఇందుకోసం అవసరమైన ఖర్చులన్నీ తామే భరిస్తామని హామీ ఇస్తూ పలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కువ మంది ఒక చోటు నుంచి వచ్చే అవకాశం ఉన్న సందర్భంలో వారందరి కోసం ప్రత్యేకంగా వాహనాలు సైతం సమకూర్చడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

నేనే స్వయంగా వస్తా



ఎన్నికల్లో ఓటు వేయడం ప్రతీ ఒక్కరి బాధ్యత. గత 30 సంవత్సరాల నుంచి ఉపాధి రీత్యా నేను ముంబాయ్‌లో ఉంటున్నా. ఎప్పుడు ఎన్నికలు జరిగినా నేనే స్వయంగా వచ్చి ఓటు వేసి వెళ్తా. ఓటు వేసేవారు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా మంచి నాయకుడిని ఎన్నుకోవాలి.

– నరెడ్ల సత్యనారాయణ, ధర్మపురి

ఎక్కడి నుంచైనా ఓటేసే విధానం రావాలి



ఉద్యోగ రీత్యా గత నలభై ఏళ్ల నుంచి ముంబాయ్‌లో నివాసం ఉంటున్నా. ఎన్నికల సమయంలో స్వగ్రామానికి వచ్చి ఓటు వేసి వెళ్తుంటా. ప్రస్తుతం వ్యక్తిగత పనులపై స్వగ్రామానికి వచ్చినప్పటికీ ఓటు వేసే వెళ్దామని ఎన్నికల వరకు సెలవు తీసుకున్నా. ఎక్కడి నుంచైనా ఓటు వేసే విధానం వస్తే వలస జీవులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వ్యయప్రయాసాలు తప్పుతాయి.

– వొజ్జల చిన్నన్న, ధర్మపురి

కాంగ్రెస్ గ్యారంటీలకు స్పందన

- ఆ పార్టీ సీనియర్ నాయకుడు వీ.హనుమంతురావు



మాట్లాడుతున్న హనుమంతరావు

మల్లాపూర్(కోరుట్ల): కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ప్రకటించిన కాంగ్రెస్ 6 గ్యారంటీలకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీ.హనుమంతురావు అన్నారు. శనివారం మల్లాపూర్ మండలం నడికుడ, మొగిలిపేట గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నర్సింగరావుతో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వాలని ప్రజల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నివర్గాలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో సీఎం కేసీఆర్ భారీ అవినీతికి పాల్పడ్డాడని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విచారణ జరిపి చర్యలు తీసుకుంటుందన్నారు. కోరుట్లలో కూడా ప్రజలు మార్పును బలంగా కోరుకుంటున్నారని, జువ్వాడి నర్సింగారావు గెలుపు ఖాయమైందన్నారు. ప్రచారంలో పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు, సుప్రీంకోర్టు అడ్వకేట్ కొమిరెడ్డి కరం, పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



రమేశ్ మృతదేహం

ధర్మపురి: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి రాయపట్నం గోదావరినదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై దత్తాత్రి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజారం గ్రామానికి చెందిన ఆకుల రమేశ్ (36) కొంతకాలం పాటు జీవనోపాధికి ముంబాయ్ వెళ్లాడు. అక్కడ మద్యానికి బానిసై తిరిగి ఇంటికి వచ్చాడు. ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో అతిగా మద్యం తాగి ఈనెల 24న ఇంటినుంచి వెళ్లిపోయాడు. పరిసర ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా శనివారం రాయపట్నం గోదావరినదిలో మృతదేహం లభించింది. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. రమేశ్ తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు మోదీ సానుకూలం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఎస్సీ వర్గీకరణ చేసేందుకుగాను ప్రధాని నరేంద్రమోదీ కమిటీ ఏర్పాటుకు అధికారులను ఆదేశించారని, ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలో కొత్తబస్టాండ్ వద్ద నిర్వహించిన సభలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల ముఖ్యమంత్రులు మోసం చేశారని, వారికి ప్రజలు ఎస్సీలు, బీసీలు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వర్గీకరణ కోసం సోనియాగాంధీ, రాహుల్ గాంధీని కలిసి న్యాయం చేయాలని కోరినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత దళిత బిడ్డను సీఎం చేస్తానని చేయలేదని ప్రశ్నిస్తే వందలమంది పోలీసులను ఇంటింకి పంపించి అరెస్ట్ చేశారని అన్నారు. మళ్లీ దొరల పాలన రాకుండా పనిచేసే నాయకుడికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెట్టుపల్లి లక్ష్మణ్, కోరుట్ల పట్టణ అధ్యక్షుడు బంగారు ప్రమోద్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మండల యువసేన అధ్యక్షుడు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మీటింగ్‌కు పోవాల్సిందే..

వేములవాడరూరల్: ఎన్నికల నేపథ్యంలో సభలు విజయవంతం కావాలంటే మహిళలు కచ్చితంగా పాల్గొనాలి. మహిళలు రావాలంటే సంఘాల పరిధిలో ఉన్న సీఏలతో నాయకులు ముందస్తుగా ఒప్పందం చేసుకుని సీఏల ద్వారా మహిళా సంఘాలను సమావేశానికి పంపిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే పార్టీ ఏదైనా సమావేశానికి తప్పకుండా వెళ్లాలని మహిళా సంఘాలకు కొంత మంది లీడర్లు హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు తెలిసింది. ఇలా సంఘాలను సమావేశాలకు తరలించేందుకు ఆయా పార్టీల నాయకుల నుంచి లీడర్లు కొంత డబ్బు ముందుగానే మాట్లాడుకుని ఇలా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొంత మంది సంఘ సభ్యులు సమావేశానికి ససేమిరా అంటే.. పైనుంచి ఆదేశాలు తప్పకుండా వెళ్లాలంటూ ఆ లీడర్లు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం.

శరవేగంగా జగిత్యాల అభివృద్ధి

- జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: ఐదేళ్ల కాలంలోనే జగిత్యాల శరవేగంగా అభివృద్ధి చేసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం బీఎల్ఎన్‌గార్డెన్, నారదాసు ఆశ్రమంలో శివసత్తుల, వైశ్య సంఘం సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. మరోసారి అవకాశం ఇస్తే వందరెట్లు అభివృద్ధి చేస్తానని, గాలిమాటలు నమ్మవద్దని, పనిచేసేవారికి ఓటు వేయాలని కోరారు.

సంక్షేమ పథకాలకు ఆకర్శితులై..

సంక్షేమ పథకాలకు ఆకర్శితులై పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం గోవిందుపల్లికి చెందిన 100 మంది పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారీ మెజార్టీతో మళ్లీ గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మవద్దు

రాయికల్(జగిత్యాల): కాంగ్రెస్, బీజేపీ మాయ మాటలు నమ్మవద్దని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం రాయికల్ మండలం రాజనగర్, ఆలూరు, వీరాపూర్, ధర్మాజీపేట, కైరిగూడెం, కట్కాపూర్, దావన్‌పల్లి, వస్తాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన మహిళలకు రూ.3 వేల నుంచి రూ.5 వేల పెన్షన్ ఇస్తామని, రూ.400లకే సిలిండర్ అందజేస్తామన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు అండగా ఉండాలి

జగిత్యాలటౌన్: బీఆర్ఎస్‌కు అండగా ఉండాలని స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్ కోరారు. శనివారం మోతె, అనంతరం తాటి వనాల్లో గౌడన్నలను కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్‌కుమార్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. వీరి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన గీతకార్మికులు బీఆర్ఎస్‌లో చేరారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో శనివారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ సంజయ్‌కుమార్‌కు ఓటు వేయాలని ఓట్లు అభ్యర్థించారు.

సంజయ్ గెలుపునకు కృషి చేయాలి



బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ కవిత

- ఎమ్మెల్సీ కవిత

కోరుట్ల: కోరుట్ల పట్టణ బీజేపీ కౌన్సిలర్లు దాసరి సునీత, మెలుమూరి అలేఖ్య, పార్టీ పట్టణాధ్యక్షుడు దాసరి రాజశేఖర్ శనివారం ఎమ్మెల్సీ కవిత సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా కవిత మాట్లాడుతూ సంజయ్ గెలుపునకు కృషి చేయాలన్నారు. అనంతరం పార్టీలో చేరినవారు మాట్లాడుతూ, బీజేపీ అభ్యర్థి, ఎంపీ అర్వింద్ నియంతలా వ్యవహరిస్తున్నారన్నారు. సంజయ్ గెలుపు కోసం పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ ఎల్.రమణ, బీఆర్ఎస్ అభ్యర్థి డా. సంజయ్, ఆర్‌బీఎస్ జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావ్, కోరుట్ల పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీ మోసం చేశాయి

గల్ఫ్ కార్మికులను కాంగ్రెస్, బీజేపీలు మోసం చేశాయని బీఆర్ఎస్ బెహరాన్ ఎన్నారై సెల్ అధ్యక్షుడు రాధారపు సతీశ్ అన్నారు. శనివారం కోరుట్లలో మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ, అంతకు ముందు పాలన సాగించిన కాంగ్రెస్ పార్టీల నిర్లక్ష్యం ఫలితంగానే గల్ఫ్ కార్మికులకు సరైన చట్టాలు అందుబాటులోకి రాలేదన్నారు. ఆయన వెంట సుమన్ తదితరులు ఉన్నారు.



గొధూర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న డాక్టర్ సమత

గొధూర్‌లో సంజయ్ సోదరి ప్రచారం

ఇబ్రహీంపట్నం/కోరుట్లరూరల్: ఇబ్రహీంపట్నం మండలం గొధూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్ సోదరి డాక్టర్ సమత ప్రచారం నిర్వహించారు. భారీ మెజార్టీతో గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. ఎంపీపీ భీమేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అలాగే కోరుట్ల మండలం యూసుఫ్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక–సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిళ్లు వచ్చేశాయ్

పెగడపల్లి(ధర్మపురి): శాసనసభ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. పాత, కొత్త పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు పూర్తి చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే దివ్యాంగులు, వృద్ధులకు వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. వృద్ధులు, దివ్యాంగులు కేంద్రాలకు వెళ్లేందుకు వీలుగా ర్యాంపులు, నడవలేని వారికోసం ట్రై సైకిళ్లను అందుబాటులో ఉంచేలా ప్రణాళిక రూపొందించారు. అందుకు సంబంధించి ట్రై సైకిళ్లు జిల్లాలోని ధర్మపురి నియోజకవర్గంలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకున్నాయి. అక్కడి నుంచి పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ రోజున వాటిని అప్పగించనున్నారు. ధర్మపురి పరిధిలో 269 పోలింగ్ కేంద్రాలున్నాయి. రెండుమూడు కేంద్రాలకు ఒకటి చొప్పున ట్రై సైకిళ్లు కేటాయించారు. ఈ లెక్కన నియోజకవర్గంలోని కేంద్రాలకు సుమారు వందకు పైగా కేటాయించారు. ఓటరు జాబితా ప్రకారం ఏ పోలింగ్ కేంద్రానికి ఎన్ని అవసరమవుతాయో గుర్తించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల నిబంధనల మేరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు పెగడపల్లి తహసీల్దార్, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఫారుక్ తెలిపారు.



పెగడపల్లి తహసీల్ కార్యాలయంలో ట్రై సైకిళ్లు

గాలి ఎటువైపు వీచేనో..!

- అంతుచిక్కని ఓటరు నాడి
- పోటాపోటీగా సభలు, రోడ్డు షోలు
- ప్రతికూలతలను అధిగమించేందుకు నాయకుల యత్నం

పెగడపల్లి(ధర్మపురి): పోలింగ్ తేదీ సమీపిస్తొన్నా ఓటర్ల మనోగతం అంతు చిక్కకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా సభలు, రోడ్డు షోలు పాదయాత్రలకు విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లి జనాలను సమీకరిస్తున్నారు. దీంతో విజయం తమదేనంటూ ఎవరికి వారు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. ఓటరు నాడి వారికి అంతుచిక్కక వణికిపోతున్నారు.

సంఘాలపై దృష్టి

ఈసారి అసెంబ్లీ బరిలో నిలిచిన అభ్యర్థులు గతంలో కన్నా భారీగా డబ్బు ఖర్చు చేస్తున్నారు. అయినా ఆశించిన మేరకు ఓటర్ల నుంచి స్పందన రాకపోవడంతో తల పట్టుకుంటున్నారు. ఈ రోజు ఒక పార్టీ జెండా పట్టిన వ్యక్తి మరుసటి రోజు మరో జెండా మోస్తున్నారు. దీంతో నేతలు తమ పార్టీ సంప్రదాయ ఓటర్లతో పాటు ప్రభావిత వ్యక్తులపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే అభ్యర్థులు ఒకవైపు పాదయాత్రలు, మరోవైపు కుల, కార్మిక, మహిళా సంఘాలు, తమపెద్దలతో రహస్య సమావేశాలు నిర్వహించి వారి మద్దతు కూడగట్టుకుంటున్నారు. ఇంత చేసినా పోలింగ్ నాటికి గాలి ఎటు వీస్తుందననే భయం వారిని వెంటాడుతోంది.

సొంత సర్వేలు

ఇప్పటికే ఆయా పార్టీల అధిష్టానాలు రెండుమూడు సార్లు నియోజకవర్గంలోని పరిస్థితులపై వివిధ సంస్థలతో సర్వేలు నిర్వహించాయి. వెనుకంజలో ఉన్న అభ్యర్థి పార్టీ అధిష్టానం చేసిన సర్వేపై నమ్మకం లేక అభ్యర్థి సొంతంగా సర్వే చేయించుకుంటూ ప్రతికూలతలు వ్యక్తమైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఆ మేరకు వ్యూహాలను రచిస్తున్నారు. ఎవరికి అనుమానం రాకుండా ప్రత్యర్థులు బలంగా ఉన్నా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఆయా ప్రాంతాల్లో ప్రచారాన్ని మరింత గట్టిగా చేసుకుంటున్నారు. ఇంత చేసినా ఓటర్ల నాడి వారికి అంతుచిక్కడం లేదు. దీంతో సామాజిక వర్గాలు, ప్రాతాల వారీగా ఓటర్లతో సమావేశమై వారిని తమ వైపు తిప్పుకునేందుకు సర్వ శక్తులు ఒడ్డుతుండటం గమనార్హం.

మద్యం పట్టివేత

కరీంనగర్ క్రైం: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. నవీన్ కుమార్ అనే వ్యక్తి శనివారం బైక్‌పై మద్యం తరలిస్తుండగా కరీంనగర్‌లోని మంచిర్యాల చౌరస్తా ఏరియాలో పట్టుకున్నామని అన్నారు. రూ.25,000 విలువైన మద్యం బాటిళ్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఎస్ఐ రూప, సిబ్బంది ఉన్నారు.

31 దేశాల్లో 'ఓటు' తప్పనిసరి

- వేయకుంటే జరిమానా, ప్రభుత్వ సాయం నిలిపివేత
- ఓటుహక్కూ తొలగింపు

కరీంనగర్ అర్బన్: మన దేశంలో కొన్నిచోట్ల 60 శాతం ఓటింగ్ జరిగితే గొప్పగా చెప్పుకునే పరిస్థితి ఉంది. అందుకే దీన్ని హక్కుగా చూడకుండా బాధ్యతగా తీసుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది. ఓటు వేయడాన్ని తప్పనిసరి చేయాలన్న డిమాండ్ కూడా ప్రజాస్వామ్యవాదుల నుంచి బలంగా వినిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 31 దేశాల్లో ఓటు వేయడం తప్పనిసరి. వేయకుంటే కొన్ని దేశాలు జరిమానా విధిస్తుండగా, మరికొన్ని ప్రభుత్వ సాయాన్ని, సదుపాయాలను నిలిపివేస్తున్నాయి. ఇంకొన్ని దేశాల్లోనైతే అలాంటి వారికి ఏకంగా ఓటుహక్కును తొలగించేస్తున్నారు. ఎందుకు ఓటు వేయలేకపోయారో సరైన కారణం చూపితే గానీ మళ్లీ ఆ హక్కును కల్పించరు. తప్పనిసరిగా ఓటు వేయాల్సిన దేశాల్లో బెల్జియం, అమెరికా, ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, అర్జెంటీనా, బొలీవియా, ఉక్రెయిన్, బ్రెజిల్, ఈజిప్టు, గ్రీస్, ఇటలీ, మెక్సికో, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్, టర్కీ, స్విట్జర్లాండ్, న్యూజిలాండ్ తదితరాల దేశాలు ఉన్నాయి.

బెల్జియం : 10 వేల యూరోల వరకు జరిమానా

ఈ దేశంలో ఓటరు జాబితాలో పేరు ఉండి, వరుసగా నాలుగు సార్లు ఓటెయ్యకపోతే.. పదేళ్ల వరకు ఓటుహక్కు తొలిగిస్తారు. మొదటిసారి ఓటు వేయకపోతే 2 వేల నుంచి 4 వేల యూరోల వరకు, రెండోసారి 10 వేల యూరోల వరకు జరిమానా విధిస్తారు. పైగా సర్కారు ఉద్యోగావకాశాలు, పథకాలు, సదుపాయాల్లో ప్రాధాన్యం తగ్గిస్తారు. ఎన్నికలు జరిగిన వారం రోజుల్లో సంబంధిత ఓటర్లపై చర్యలు తీసుకుంటారు.

అమెరికా : ఎన్నికల రోజు సెలవు ఉండదు

ఇక్కడ ఓటు వేయడంపై ఎలాంటి ఆంక్షలూ లేవు. అయినా ఇక్కడ 85 శాతం వరకు ఓటింగ్ నమోదవుతుంది. పోలింగ్ రోజు సెలవు ఉండదు. ఉద్యోగులు, ప్రజలు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తమ ఓటుహక్కు వినియోగించుకోవచ్చు. ఓటు విలువ పట్ల అమెరికన్లలో చైతన్యం ఎక్కువ.

బొలీవియా : గుర్తింపు కార్డు ఉంటేనే సౌకర్యాలు

ఈ దేశంలో ఓటు వేసినవారికి గుర్తింపు కార్డు జారీ చేస్తారు. అది ఉన్నవారికే ప్రభుత్వ సౌకర్యాలను కల్పిస్తారు. రేషన్, విద్యుత్, తాగునీటి వసతి పొందాలంటే ఈ కార్డును సంబంధిత అధికారులకు చూపించాల్సిందే. ప్రభుత్వ ఉద్యోగులు ఓటు వేయకపోతే.. వేతనాలు సరిగా అందవు. చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

ఆస్ట్రేలియా : వారం రోజుల్లో విచారణ

ఇక్కడ అర్హులైన ప్రతిఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి. ఎన్నికల రోజున వీరంతా తప్పకుండా ఓటు వేయాలి. వేయకుంటే జరిమానా విధిస్తారు. ఎన్నికలు జరిగిన వారంలోగా విచారణ చేపట్టి, అపరాధ రుసుము ఎంతన్నది నిర్ణయిస్తారు. ఇక్కడ 96 శాతం ఓటింగ్ నమోదవుతుంది. ఎన్నికలకు చాలా ముందు నుంచే ఓటుహక్కు వినియోగంపై ప్రభుత్వం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

గ్రీస్ : డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు రద్దు

ఇక్కడ ఓటు వేయకపోతే డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు రద్దవుతాయి. లేదంటే వాటి మంజూరును నిలిపివేస్తారు. ఓటు వేయకపోవడానికి గల కారణాలను అధికారులకు ఆధారాలతో చూపించాల్సి ఉంటుంది. వారు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందితేనే మళ్లీ ఓటుహక్కు పునరుద్ధరిస్తారు. ప్రభుత్వం నుంచి పొందే సౌకర్యాలపై ఆంక్షలు విధిస్తారు.

సింగపూర్ : పేరు తొలగిస్తారు

అభివృద్ధికి మారుపేరుగా నిలిచే సింగపూర్‌లో ఓటు వేయడం తప్పనిసరి. వేయనివారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తారు. ఓటు వేయకపోవడానికి గల కారణానికి ఆధారాలను అధికారులకు చూపిస్తే పునరుద్ధరిస్తారు. ఎక్కువ మంది ప్రజలు కోరుకునే ప్రభుత్వం అధికారంలోకి రావడం వల్లే సింగపూర్ అభివృద్ధిలో ముందుందన్న వాదనలున్నాయి.

ఇక్కడా తప్పనిసరి చేయాలి..

ఎన్నికలు ప్రగతికి బాటలు వేస్తాయి. మంచి ప్రభుత్వం రావడానికి దోహదపడతాయి. అందుకే అయిదేళ్లకోసారి ఎలక్షన్ కమిషన్ ఎన్నికలు నిర్వహిస్తోంది. అయితే, చాలా ప్రాంతాల్లో అర్హులైన అనేక మంది వివిధ కారణాలతో తమ ఓటుహక్కు వినియోగించుకోవడం లేదు. వందశాతం లక్ష్యంగా ఎన్నికల సంఘం అధికారులు కృషి చేస్తున్నారు. అర్హులైన ప్రతీ ఓటరు ఓటు వేసేలా ప్రచారం, ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మన దగ్గర కూడా ఓటు వేయడం తప్పనిసరి చేయాలి. ఇతర దేశాల తరహా ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని ప్రజాస్వామ్యవాదులు అంటున్నారు.